సాక్షి శ్రీకాకుళం

బుధవారం : 27 : సెప్టెంబర్ : 2023

I



అందాలలో అహో..

జిల్లాకు పర్యాటకులు పెరుగుతున్నారు. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం.

- IIలో



నీ బంటు మేమంటు

ఆ ఊరిలో వినాయక చవితి ప్రత్యేకం. ఐదున్నర దశాబ్దాలుగా ఒకే రీతిన నిర్వహిస్తున్నారు.

- IIలో

సదరం సర్టిఫికెట్లు జారీ

శ్రీకాకుళం: జిల్లాలోని దివ్యాంగత్వం కలిగిన వారికి సదరం ద్వారా ఇచ్చే ధ్రువీకరణ పత్రాల జారీ మళ్లీ మొదలైంది. రెండు నెలలుగా డిజిటల్ సైన్‌కు సంబంధించి సాంకేతిక లోపం తలెత్తడంతో పత్రాలు పెండింగ్‌లో ఉండిపోయాయి. మంగళవారం నాటికి సమస్య పరిష్కారం కావడంతో పెండింగ్‌లో ఉన్న అన్ని ధ్రువీకరణ పత్రాలు జారీచేశారు. ధ్రువీకరణ పత్రాలు పెండింగ్‌లో ఉన్నవారు వారికి దగ్గరలో ఉన్న సచివాలయంలో సంప్రదించి పొందాల్సి ఉంటుంది.

న్యూస్‌రీల్

21 పోస్టులకు అర్హుల మెరిట్ జాబితా సిద్ధం

అరసవల్లి: ఏపీ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో 21 పోస్టుల భర్తీలో భాగంగా అర్హుల మెరిట్ జాబితా సిద్ధమైంది. ఈ పోస్టులకు సంబంధించి ఈనెల 4లోగా అందజేసిన దరఖాస్తుల స్క్రూటినీ అనంతరం మెరిట్ జాబితాను ఈ నెల 29 వరకు డీసీహెచ్‌ఎస్ కార్యాలయం వద్ద అందుబాటులో ఉంచుతున్నట్లుగా డీసీహెచ్‌ఎస్ భాస్కరరావు తెలియజేశారు. మరిన్ని వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

నేడు ఆలయ పాలకమండలి సభ్యుల సమావేశం

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయ పాలక మండలి సభ్యుల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. ఈ మేరకు స్థానిక సమావేశ మందిరంలో ఏర్పాట్లు చేశామని, సభ్యులు హాజరై ఆలయ అభివృద్ధిపై చర్చించాలని కోరారు.

మరో మూడు రోజులే...

శ్రీకాకుళం: రెండు వేల రూపాయల నోటు మార్పిడికి మరో మూడు రోజులే గడువుంది. సెప్టెంబర్ 30లోగా ఈ నోట్లను మార్చుకోవాలని ఆర్‌బీఐ గడువు విధించిన సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 27వ తేదీ నుంచి 30 వ తేదీ వరకూ నాలుగు రోజులు గడువు ఉన్నప్పటికీ గురువారం బ్యాంకులకు సెలవు కావడంతో మరో మూడురోజులే గడువు ఉన్నట్లు లెక్క. ఆర్బీఐ విడుదల చేసిన ప్రకటన మేరకు సెప్టెంబర్ 15 వ తేదీ నాటికి 95 శాతం నోట్లు వెనక్కి వచ్చినట్లు తేలింది. మిగిలినవారు ఈ నెల 30 లోగా బ్యాంకుల్లో మార్చుకోవాల్సి ఉంటుంది.

సెంచూరియన్ వర్సిటీలో అడ్మిషన్లకు దరఖాస్తులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్కిల్ ఇంటిగ్రేటెడ్ ఉన్నత విద్యలో నీతి ఆయోగ్ ప్రశంసించిన సెంచూరియన్ వర్సిటీలో 2024 సంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు వర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ సుప్రియా పట్నాయక్, డైరెక్టర్ (అడ్మిషన్స్ మరియు మార్కెటింగ్) సుకాంత పరిడాలు ఒక పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. సెంచూరియన్ వర్సిటీలో 63 ప్రోగ్రాంలు, 14 స్కూల్స్ ఉన్నాయి. వీరి క్యాంపస్‌లు పర్లాకిమిడి, ఖుర్దా, బాలసోర్, బలంఘీర్, రాయఘడ, ఛత్రపూర్, విజయనగరంలో ఉన్నట్లు పేర్కొన్నారు. కొత్తగా అగ్రికల్చర్ కోర్సులో డైరీ టెక్, ఫిటో ఫార్మా, బయో ఇంజినీరింగ్, హెల్త్ సైన్స్, ఫోరెన్సిక్ సైన్సు, సైబర్ సెక్యూరిటీ, యానిమేషన్, మల్టీమీడియా, వెటర్నరీ, యానిమల్ హజ్బెండరీ, మారీటైంతో పాటు ఇంజినీరింగ్, ఆక్వా రంగాల్లో వివిధ కోర్సులు అందుబాటులోకి వచ్చినట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు www. cutm. ac. in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

28న మిలాద్ ఉన్ నబీ ర్యాలీ

శ్రీకాకుళం కల్చరల్: మిలాద్ ఉన్ నబీ వేడుకల సందర్భంగా ఈనెల 28న గురువారం ఉదయం 9గంటలకు శ్రీకాకుళంలో గల అన్ని మసీదుల్లో ముస్లిం సోదరులతో భారీ ర్యాలీ నిర్వహించేందుకు సంబంధిత మత పెద్దలు నిర్ణయించారు. ప్రకాష్ నగర్‌లోని హుస్సేని మసీదు నుంచి ప్రారంభమై జీటీ రోడ్డు మీదుగా గల జామియా మసీదు నుంచి చంపా మసీదు, చందామసీదు, పాలకొండ రోడ్డులోని మదీనా మసీదు మీదుగా డే అండ్ నైట్ కూడలి, రైతుబజారు, పీఎస్‌ఎన్‌ఎం హైస్కూల్ వద్ద మీనా మసీదు మీదుగా జీటీ రోడ్డులోని జామియా మసీదు వరకు సాగుతుందని తెలిపారు. జామియా మసీదులో మత గురువులతో ప్రసంగాలు, అనంతరం నమాజు తరువాత విందు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపోలో ఆన్ కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో అక్టోబరు 2వ తేదీలోగా శ్రీకాకుళం ఒకటో డిపో కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు. హెవీ లైసెన్స్ వచ్చి 18 నెలలు పూర్తవ్వాలని, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బ్లడ్ గ్రూప్ సర్టిఫికెట్, జన్యూన్ సర్టిఫికెట్లతో సంప్రదించాలని కోరారు. వివరాలకు 9959225608, 7382921647 నంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు.



దశాబ్దాల చింతలు

చెక్ చెప్పిన వంతెనలు

- జిల్లాలో రూ.300కోట్లకు పైగా వ్యయంతో వంతెనలు, రహదారుల నిర్మాణం
- దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించిన వైఎస్ జగన్ సర్కారు
- అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను పూర్తి చేసిన ప్రభుత్వం

దశాబ్దాలుగా వంశధార చూసిన ఆ ఊళ్ల 'వే'దన ఇన్నాళ్లకు తీరింది. ఏళ్లకు ఏళ్లు నాగావళి కడిగిన ఆ గ్రామాల కన్నీళ్లకు ఈనాటికి తెర పడింది. మహేంద్ర తనయ తీరం వెంబడి సాగిన సుదీర్ఘ ప్రయాణాలు, బాహుదాను దాటలేక పల్లెలు పడిన అవస్థలకు ఇప్పటికి అడ్డుకట్ట పడింది. సరైన సారథి లేక ఆగిపోయిన వారధుల నిర్మాణాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఊపిరి పోసింది. దారి లేక ఇక్కట్లు పడుతున్న ఊరికి కొత్త సత్తువ అందించింది. వంతెన పని ఇంతేనా అన్నంత సులువుగా నిర్మాణాలను పూర్తి చేస్తూ నదుల గట్టున ప్రగతి బొట్టును దిద్దింది.

సాక్షి డెవలప్‌మెంట్ వాచ్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

వానాకాలం వస్తే చాలు బయట ప్రపంచంతో సంబంధం తెగిపోయే గ్రామాలు కొన్ని. నది అవతల గట్టున ఉన్న ఊరికి గంటల పాటు ప్రయాణించి వెళ్లే పల్లెలు మరికొన్ని. అత్యవసర సమయాల్లో నదులు దాటలేక సరైన దారులు లేక ఇబ్బంది పడిన ఊర్లు ఇంకొన్ని. ఇలాంటి ప్రాంతాల సమస్యలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిష్కరించింది. దశాబ్దాలుగా ఇక్కడ అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు ఓ దారి చూపింది. జిల్లాలో రెండు ప్రాంతాల మధ్య అనుసంధానం లేని చోట, రాకపోకలకు అవకాశం లేని గ్రామాల మధ్య భారీగా వంతెనలు నిర్మించేందుకు ఈ ప్రభుత్వం సంకల్పించింది. యుద్ధ ప్రాతిపదికన నిర్మాణాలు చేపట్టి అక్కడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తోంది. కొన్ని దశాబ్దాలుగా రహదారి ఇక్కట్లు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో దాదాపు రూ. 300 కోట్ల విలువైన వంతెనల నిర్మాణంతో పాటు వాటికి అవసరమైన రహదారులను నిర్మించే కార్యక్రమాన్ని తలపెట్టింది. 15 వంతెనల నిర్మాణం పూర్తి చేసే బాధ్యతను వైఎస్ జగన్ ప్రభుత్వం భుజానికెత్తుకుంది. వాటిలో సగానికి పైగా ఇప్పటికే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీర్ఘకాలంగా ఉన్న రహదారి కష్టాలను తీర్చింది.



రెండు రాష్ట్రాలకు..

ఎక్కడ: ఇచ్ఛాపురం మండలం అరకబద్ర-కొలిగాం మధ్య బాహుదా నదిపై

మేలు జరిగే గ్రామాలు: ఆంధ్రా- ఒడిశా రాష్ట్రాలను కలుపుతూ 17గ్రామాల ప్రజల కష్టాలు తీరనున్నాయి. ముఖ్యంగా అరకబద్ర నుంచి కొలిగాంకు ఇచ్ఛాపురం మీదుగా 30కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఐదు నిమిషాల్లోనే అరకబద్ర నుంచి కొలిగాం చేరుకోవచ్చు.

వ్యయం: రూ.13.80కోట్లు

42 గ్రామాల సమస్య



ఎక్కడ: నరేంద్రపురం కణితిపూరు మధ్య..

మేలు జరిగే గ్రామాలు: పూండి ఉద్దానం నుంచి నందిగాం మండలంలోని 42 గ్రామాలకు రహదారి సమస్య తీరింది. వంశధార ప్ర ధాన ఎడమ కాలువపై పాత వంతెన కూలిపోవడంతో కొత్త వంతెన నిర్మించారు.

వ్యయం: రూ.1.58కోట్లు

రెండు జిల్లాలను కలుపుతూ..

ఎక్కడ: విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం నిమ్మలవలస-జి.సిగడాం మండలం పెనసాం గ్రామాల మధ్యలో ఉన్న నిమ్మలవలస గెడ్డపై.

మేలు జరిగే గ్రామాలు: ఇరు జిల్లాల పరిధిలో దాదాపు 50 గ్రామాలు.

వ్యయం: రూ.3.05కోట్లు



మూడు మండలాలకు లింకు బ్రిడ్జి



ఎక్కడ: సారవకోట, పాతపట్నం, కోటబొమ్మాళి మండలాలను కలిపేలా దంత జంక్షన్‌లో

మేలు జరిగే గ్రామాలు: దీనివలన 50 గ్రామాల ప్రజలకు రహదారి కష్టాలు తొలగనున్నాయి. దంత జంక్షన్ నుంచి సారవకోట మండలం హైవే వరకు రహదారి విస్తరణ కూడా చేపట్టారు.

వ్యయం: రూ.1.99కోట్లు

ఎక్కడ: వంశధారనదిపై తెలికిపెంట-కొమనాపల్లి గ్రామాల నడుమ

మేలు జరిగే గ్రామాలు: జలుమూరు, కోటబొమ్మాళి, పాతపట్నం, సారవకోట, టెక్కలి, హిరమండలం, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస, పాలకొండ మండలాల ప్రజలకు మేలు చేకూరింది. వంతెన నిర్మాణంవలన విద్య, వ్యాపార వర్గాలకు అన్ని విధాలా సదుపాయంగా ఉంది.

వ్యయం: రూ.42కోట్లు

తొలగిన ఒడిశా ప్రయాణ కష్టాలు



ఎక్కడ: పాతపట్నం నియోజకవర్గం కాగువాడ-రొమదల గ్రామాల మధ్య మహేంద్రతనయ నదిపై

మేలు జరిగే గ్రామాలు: 27 గ్రామాలకు దారి కష్టాలు తీరాయి. వంతెన లేక ముందు పాతపట్నం మండల కేంద్రానికి రావాలంటే ఒడిశా మీదుగా 13 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి వచ్చేది. వంతెన నిర్మాణంతో పాటు రూ.1.58కోట్లతో రెండు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు వేశారు.

వ్యయం: రూ.6.95కోట్లు

శరవేగంగా..



ఎక్కడ: ఆమదాలవలస మండలం తొగరాం పంచాయతీ ఇసుకలపేట, సంతకవిటి మండలం వాల్తేరు గ్రామాల మధ్య నాగావళి నదిపై బలసలరేవు వంతెన

మేలు జరిగే గ్రామాలు: 480 మీటర్ల పొడవు, 12.5 మీటర్ల వెడల్పుతో పనులు జరుగుతున్నాయి. ఈ వంతెన నిర్మాణంతో 60 గ్రామాల ప్రజలు కష్టాలు తీరనున్నాయి. రాజాం, విజయనగరం నుంచి వచ్చే ప్రయాణికులు ఇచ్ఛాపురం సులువుగా చేరుకోవచ్చు. 80 కిలోమీటర్ల దూరం కలసివస్తుంది.

వ్యయం: 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ.87కోట్లు మంజూరు చేసింది.దీంతో 2022లో వంతెన నిర్మాణ పనులను స్పీకర్ తమ్మినేని సీతారాం ఇసుకలపేట వద్ద ప్రారంభించారు.

ఉప్పటేరు సమస్య తీరేలా..



ఎక్కడ: ఎరముక్కాం-ఎకువూరు మధ్య ఉప్పుటేరుపై

మేలు జరిగే గ్రామాలు: సోంపేట మండం ఉప్పలాం పంచాయతీ, సిరిమామిడి పంచాయతీ, మామిడిపల్లి పంచాయతీ పరిధిలో గల 12 గ్రామాల ప్రజల రహదారి కష్టాలు తీర్చేందుకు, 40 ఏళ్లగా ఉన్న డిమాండ్ నేటికి సాకారమవుతోంది.

వ్యయం: రూ.5.90కోట్లు

ఫ్లై ఓవర్‌కు మోక్షం

ఎక్కడ: పొందూరు నుంచి రాజాంకు వెళ్లే రహదారిలో

మేలు జరిగే గ్రామాలు: సుమారు 100 గ్రామాలకు రైల్వే గేటు కష్టాలు తీరాయి. టీడీపీ హయాంలో నిధులు చాలక పనులు ఆపేస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేసింది.

వ్యయం: రూ.27కోట్లు



రొయ్యల సాగు కోసం..



గార మండలం పడపానిపేట నుంచి రొయ్యల చెరువుల కోసం ప్రత్యేకంగా వంతెన నిర్మాణం చేపడుతున్నారు. రూ.4కోట్లతో వంతెనతో పాటు బ్రిడ్జి అవతల రోడ్డు నిర్మాణం కూడా చేపడుతున్నారు. ఇది పూర్తయితే 1000ఎకరాల రొయ్యల చెరువుల సాగు జరగనుంది.

30 కిలోమీటర్ల దూరం తగ్గింది

ఎక్కడ: బూర్జ మండలం నారాయణపురం-సంతకవిటి మండలం రంగరాయపురం గ్రామాల మధ్య.

మేలు జరిగే గ్రామాలు:ఈ వంతెన నిర్మాణంతో బూర్జ, ఆమదాలవలస, సరుబుజ్జిలి, పాలకొండ మండలాలతో పాటు సంతకవిటి, రాజాం, పొందూరు, రేగిడి మండలాలకు చెందిన ప్రజలకు రహదారి కష్టాలు తప్పాయి.



దాదాపు 30కిలోమీటర్ల దూరం తగ్గింది. గతంలో ఇక్కడ వంతెన లేకపోవడంతో ప్రతి రోజూ నాటు పడవల ద్వారా నదిలో ప్రయాణించి ప్రమాదాల్లో చిక్కుకునేవారు.

తొలగిన కష్టాలు



కాగువాడ-రొమదల మధ్య నదిపై వంతెన ప్రారంభం కావడంతో 27గ్రామాల ప్రజలకు ప్రయాణ కష్టాలు తీరాయి. కాగువాడ, కురసవాడ, బూరగాం గ్రామాల రైతులు వ్యవసాయం చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. గతంలో వ్యవసాయం చేయాలంటే పాతపట్నం, పర్లాకిమిడి మీదుగా నది అవతలకు వెళ్లాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు, ఎమ్మెల్యే రెడ్డి శాంతికి ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారు.

– నల్లి జగదీశ్వరరావు, కాగువాడ గ్రామం. పాతపట్నం మండలం.

తప్పిన ఇబ్బందులు



కాగువాడ-రొమదల బ్రిడ్జి గిరిజన ప్రజలకు ఎంతగానో ఉపయోగపడింది. 14 గిరిజన గూడలకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగింది. పనిమీద మండల కేంద్రానికి రావాలంటే ఒడిశా మీదుగా రావాల్సి ఉండేది. ఇప్పుడు 15 కిలోమీటర్ల దూరం తగ్గింది. ప్రస్తుతం మండల కేంద్రం 6 కిలోమీటర్లు మాత్రమే.

– ఎస్.రామారావు, గిరిజనుడు, బైదలాపురం గ్రామం, పాతపట్నం మండలం.

30న ప్రభుత్వ ఉద్యోగుల సహకార స్టోర్స్ సర్వసభ్య సమావేశం

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సహకార స్టోర్స్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30వ తేదీన శ్రీకాకుళంలోని బొందిలీపురంలోని ప్రభుత్వ ఉద్యోగుల సహకార స్టోర్స్ కార్యాలయంలో జరుగుతుందని ప్రభుత్వ ఉద్యోగుల సహకార స్టోర్స్ అధ్యక్షుడు బి.చిట్టిబాబు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023-2024 సంవత్సరానికి గాను మొదటి సర్వసభ్య సమావేశం ఈనెల 30వ తేదీ శనివారం ఉదయం 10గంటలకు ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి మహాజన సభ్యులందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జిల్లా సీనియర్స్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు రేపు



సాఫ్ట్‌బాల్ సాధనలో ప్లేయర్స్‌కు మెలకువలు నేర్పిస్తున్న ఎంవీ రమణ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు గురువారం జరగనున్నాయని శ్రీకాకుళం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, ప్రధాన కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా 28వ తేదీన ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఇక్కడ ఎంపికైన జిల్లా ప్రాబబుల్స్ జట్లకు శిక్షణ శిబిరాలను నిర్వహించిన అనంతరం తుది జట్లను ప్రకటిస్తామని పేర్కొన్నారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ వేదికగా అక్టోబర్ 16 నుంచి 19 వరకు జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా జట్లను పంపించనున్నట్లు వెల్లడించారు. జిల్లా ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో హాజరుకావాలని నరసింహరాజు, లక్ష్మీదేవి సూచించారు. మరిన్ని వివరాలకు సంఘ కార్యనిర్వహక కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ (94410 11391)ను సంప్రదించాలని వారు కోరారు.

పిడుగుపాటుకు 20 గొర్రెలు మృతి

హిరమండలం: మండలంలోని కొమనాపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం పిడుగు పడి 20 గొర్రెలు మృతి చెందాయి. ఆ గ్రామానికి చెందిన జి.లక్ష్మణరావు తన గొర్రెలు, మేకలను మేత కోసం సమీపంలోని పొలాలకు తీసుకెళ్లారు. సాయంత్రం ఉరుములు మెరుపులతో వర్షం ప్రారంభమై పిడుగు పడింది. దీంతో 20 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. స్థానిక సర్పంచ్ గోవిందరావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు తూలుగు తిరుపతిరావు బాధితుడిని పరామర్శించారు.



హిరమండలం కొమనాపల్లిలో పిడుగుపాటుకు మృతి చెందిన గొర్రెలు

సంపూర్ణ ప్రజారోగ్యమే లక్ష్యం: కలెక్టర్



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

ఎచ్చెర్ల క్యాంపస్: సంపూర్ణ ప్రజారోగ్యం లక్ష్యంగా వైద్య సిబ్బంది ముందుకు సాగాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. అల్లినగరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ నెల 30వ తేదీ నుంచి గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. గృహ సందర్శనతో ప్రజల ఆరోగ్యం గురించి తెలుసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు, ఆరోగ్య శ్రీ సేవలపై అవగాహన కల్పించాలని తెలిపారు. వైద్య సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఇంటింటా సర్వే చేయాలని, ఆరోగ్య శ్రీ యాప్‌లను ప్రజలు ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయాలని చెప్పారు.

ఇంటి వద్దనే రోగులకు ఏడు రకాల పరీక్షలు నిర్వహించాలని అన్నారు. నిరంతరం వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఎంహెచ్ఓ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా స్థాయి సాఫ్ట్ టెన్నిస్ స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు రేపు

పాతపట్నం: జిల్లాస్థాయి సాఫ్ట్ టెన్నిస్ స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు గురువారం ఉదయం 9గంటల నుంచి నిర్వహిస్తున్నామని జిల్లా సాఫ్ట్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడు గురాడి అప్పన్న, గేమ్స్ పర్యవేక్షకులు పీడీ వై.శేఖర్ బాబులు మంగళవారం తెలిపారు. ఈ ఎంపిక పోటీలు మండలంలోని కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్నామని, అండర్-14, 17 విభాగంలో బాలబాలికలు ఎంపిక పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎస్‌జీఎఫ్ బీవీ రమణ, ప్రధానోపాధ్యాయుడు బి.సింహాచలం, పీఈటీలు పోటీలను నిర్వహిస్తారని సంఘం అధ్యక్షుడు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎస్పీ జీఆర్ రాధిక

సోంపేట: సోంపేట పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ రాధిక మంగళవారం పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలనిపోలీసు అధికారులను సూచించారు. వార్షిక తనిఖీల కార్యక్రమంలో రికార్డులు పరిశీలించారు. స్పందన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, సీఐ రవి ప్రసాద్, ఎస్ఐ హైమావతి, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

28న సంజ్ఞల భాష దినోత్సవం

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంతర్జాతీయ బధిరుల సంజ్ఞల భాషా దినోత్సవం ఈ నెల 28న నిర్వహించనున్నట్లు బధిరుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఉంగటి సురేష్, రవికిరణ్‌లు తెలిపారు. కార్యక్రమం ఆ రోజున ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిరంలో నిర్వహించనున్నామని, అనంతరం ర్యాలీ ఉంటుందని తెలిపారు.

బనారస్ ఎక్స్‌ప్రెస్ సేవల విస్తరణ

భువనేశ్వర్: రాష్ట్రంలో దక్షిణ, పశ్చిమ జిల్లాల్లో రైల్వే సేవలను మెరుగుపరిచే దిశగా రైల్వే శాఖ మరో అడుగు ముందుకేసింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సంబల్‌పూర్, బనారస్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను విశాఖపట్నం వరకు పొడిగించడానికి ఆమోద ముద్ర వేయడం విశేషం. ఈ రైలు టిట్లాగఢ్, రాయగడ మీదుగా రాకపోకలు సాగిస్తుంది. ఈ ప్రాంతాల నుంచి ప్రజలు తరచుగా పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని పలు ఆస్పత్రులకు ప్రయాణిస్తుంటారు. దీంతో వీరికి ఆ రైలు సర్వీసు బాగా ఉపయోగపడుతుంది. ఈ రైలు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్, హతియా, రాంచీ, రౌర్కెలా, ఝార్సుగుడ, సంబల్‌పూర్ వంటి కీలకమైన జంక్షన్ల గుండా పరుగులు తీస్తుంది.

అందాలలో అహో మహోదయం

- జిల్లాలో పెరుగుతున్న పర్యాటకుల సంఖ్య
- కొత్తగా 67 బీచ్‌ల అభివృద్ధికి చర్యలు
- వసతి కల్పనపై దృష్టి సారించిన పర్యాటక శాఖ
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



శాలిహుండం బౌద్ధారామాన్ని పరిశీలిస్తున్న పర్యాటక శాఖ ఈడీ మల్‌రెడ్డి (ఫైల్)



శాలిహుండం బౌద్ధారామం వద్ద యువక్లబ్‌ల పర్యటన

అరసవల్లి: సముద్ర తీరాలు, ఆధ్యాత్మిక స్థలాలు, ఎత్తైన పర్వతాలు, నదీ సంగమ స్థలాలు, చారిత్రక ప్రాంతాలు శ్రీకాకుళం వైభవాన్ని చాటుతున్నాయి. ఈ పర్యాటక ప్రదేశాలను చూసేందుకు జిల్లాకు వచ్చే పర్యాటకుల సంఖ్య ఏటా పెరుగుతోంది. పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని పంచేలా పలు బీచ్‌లను గుర్తించిన రాష్ట్ర పర్యాటక శాఖ, శాలిహుండం వంటి పురాతన ప్రాంతాల్లో పర్యాటకులకు వసతి సౌకర్యాలు మెరుగుపరిచేలా చర్యలు చేపడుతోంది. అలాగే విద్యార్థి దశ నుంచే పర్యాటక విశిష్టత తెలియజేసేందుకు పలు కళాశాలు, పాఠశాలల్లో విద్యార్థులతో యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఇప్పటికే 66 క్లబ్‌లు నమోదై జిల్లాలో పర్యాటక యాత్రలు చేస్తున్నారు.

గ్రీన్ టూరిజం లక్ష్యంగా..

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది పర్యాటక ప్రాంతాల్లో గ్రీనరీని మరింత మెరుగుపర్చాలనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిశానిర్దేశం చేశాయి. ఈ మేరకు జిల్లాలో బుధవారం ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఈ దిశగా అధికారులు అడుగులు వేయనున్నారు. అరసవల్లి, శ్రీముఖలింగం, శ్రీకూర్మం, శాలిహుండం, దంతపురి, బారువ, పొందూరు, బెజ్జిపురం, బుడితి, కూర్మ తదితర ప్రసిద్ధ స్థానాల్లో కూడా పచ్చదనం నిండేలా చర్యలు చేపట్టేలా ప్రణాళికలను నేటి నుంచి అమలు చేయనున్నారు.

పర్యాటకులు వస్తున్నారిలా..

జిల్లాలో పర్యాటకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. 2022-23 లో సుమారు 45 లక్షల మంది స్వదేశీ, 52 మంది విదేశీ పర్యాటకులు జిల్లాను సందర్శించినట్లుగా టూరిస్ట్ ఫుట్‌ఫాల్ లెక్కలు చెబుతున్నాయి. అలాగే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు కూడా స్వదేశీ పర్యాటకులు సుమారు 20 లక్షల వరకు చేరినట్లుగా లెక్కలు చెబుతున్నాయి. ఇక జిల్లాలో ప్రసిద్ధమైన అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయంతో పాటు టెంపుల్ టూరిజంలో భాగంగా ఉన్న శ్రీకూర్మంలోని కూర్మనాథ స్వామి ఆలయం, శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వర స్వామి వారి ఆలయం, రావివలసలోని ఎండల మల్లికారున స్వామి వారు, మందసలోని శ్రీవాసుదేవుని ఆలయంతో పాటు సుమారు 52 ప్రముఖ ఆలయాలు జిల్లా పర్యాటక ప్రాంతాలుగా గుర్తింపు పొందాయి. వీటితో పాటు బౌద్ధారామాలైన శాలిహుండం, నగరికటకం (గార), దంతపురి (సరుబుజ్జిలి), జగతిమెట్టు, జొన్నాం (పోలాకి), ప్రాచీన శిలాశాసనాల ప్రాంతాలుగా నగరాలపేట, కళింగపట్నం (గార), దీర్ఘాసి (పోలాకి), జైన ఆరామాలుగా సంగమయ్య కొండ (ఆమదాలవలస), పాండవుల మెట్ట (టెక్కలి), విష్ణుకొండ (సరుబుజ్జిలి), సంస్థానాల కోటలుగా మందస, సురంగిరాజా (ఇచ్ఛాపురం), తర్లకోట (టెక్కలి), డచ్ భవనం (శ్రీకాకుళం), లైట్‌హౌస్ (కళింగపట్నం, బారువ) తదితర ప్రాంతాలు నిత్యం పర్యాటకులతో సందడి చేస్తున్నాయి. వీటితో పాటు ఇటీవల వెలుగులోకి వచ్చిన కూర్మ వైదిక గ్రామం కూడా నిత్యం పర్యాటకులతో కళకళలాడుతున్నాయి.

మరింత ఆహ్లాదం కోసం బీచ్‌లు

జిల్లాలోని బీచ్‌లను మరింత ఆహ్లాదంగా తయారు చేయనున్నారు. ఈ మేరకు ఇటీవల కేంద్ర బృందం ఒకటి జిల్లాలో పర్యటించింది. రాష్ట్రంలో అత్యధికంగా స్థానిక జిల్లాలోనే 67 బీచ్‌లను ఆధునికీకరించడానికి గుర్తించారు.

అనుకూల వాతావరణానికి కృషి



రాష్ట్రంలో పర్యాటకులు అధికంగా సందర్శించే జిల్లాల్లో శ్రీకాకుళం ఒకటి. ఎన్నో పురాతన ఆలయాలు, ప్రదేశాలు, చూడచక్కని ఆకట్టుకునే అప్‌హిల్స్, సహజసిద్ధమైన బీచ్‌లు మన జిల్లాలో ఉన్నాయి. పర్యాటకులను ఆకట్టుకునేందుకు వీలుగా సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగా 67 బీచ్‌లను గుర్తించి కోస్టల్ పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపడుతున్నాం. 66 యువక్లబ్‌ల ద్వారా విద్యార్థులకు పర్యాటక స్థలాల విశిష్టతలు, జిల్లా చరిత్ర విశేషాలు తెలిసేలా చర్యలు చేపడుతున్నాం.

– ఎస్.నారాయణరావు,
జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖాధికారి.

నేడు హెరిటేజ్ వాక్

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో హెరిటేజ్ వాక్ పేరిట ప్రత్యేక ర్యాలీ నిర్వహించనున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల నుంచి సూర్య మహల్ వద్ద ఉన్న జామియా మసీద్ వరకు యువక్లబ్ మెంబర్లతో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ మీద ప్రతిజ్ఞ చేయించనున్నారు.

నియోజకవర్గాల వారీగా బీచ్‌లు పరిశీలిస్తే..

శ్రీకాకుళం: కుందువానిపేట, గనగళ్లవానిపేట, బలరాంపురం, కళింగపట్నం, శ్రీకూర్మం(మత్స్యలేశం), మొగదాలపాడు, కొమరివానిపేట, బందరువానిపేట, కె.మత్స్యలేశం.

ఎచ్చెర్ల: బడివానిపేట, బుడగట్లపాలెం-1, బుడగట్లపాలెం-2, డి.మత్స్యలేశం, రాళ్లపేట, కె.మత్స్యలేశం, శివాజీ దిబ్బలపాలెం, కొత్త దిబ్బలపాలెం, పాత దిబ్బలపాలెం.,పోతయ్యపాలెం, అల్లివలస, జీడిపాలెం, కొవ్వాడ, చీకటివానిపేట, దోనిపేట, గురయ్యపేట.

నరసన్నపేట: రాజరామపురం, పెద్దకొవిరిపేట, జోగంపేట, కొత్తరేవు,గొల్లవానిపేట, గుప్పిడిపేట.

పలాస: ఎం.గంగువాడ, గడ్డేరు, బేతాళపురం, రట్టి

వజ్రపుకొత్తూరు: మంచినీళ్లపేట,డొంకులపాడు, కంబాలరాయుడుపేట, అక్కుపల్లి, గుణుపల్లి, నువ్వలరేవు, హుకుంపేట, తొట్టూరు, దేవునల్తాడ, కొత్తపేట.

ఇచ్ఛాపురం: బారువ, రామయ్యపట్నం, ఇసుకలపాలెం, బట్టిగల్లూరు, ఎక్కూరు, సిహెచ్.గొల్లగండి, కపాసుకుద్ది, పుక్కళ్లవానిపాలెం, కొత్తపాలెం, చిన్నకర్రివానిపాలెం, పెద్దకర్రివానిపేట, ఇద్దువానిపాలెం, కొత్తకళింగపట్నం (ఒంటూరు), బట్టివానిపాలెం, డొంకూరు.

టెక్కలి: భావనపాడు, గెద్దలపాడు, ఎం.సున్నాపల్లి, పిట్టవానిపేట, కుందువానిపేట, పాతమేఘవరం, మరువాడ.

ఉత్సాహంగా జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు



గ్రిగ్స్ మీట్ సెక్రటరీ కె.మాధవరావును సత్కరిస్తున్న డిప్యూటీ ఈఓ తిరుమల చైతన్య, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. జిల్లా విద్యాశాఖ పరిధిలోని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో జరుగుతున్న జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీల్లో భాగంగా రెండో రోజు కూడా బాల బాలికలు అదిరేటి ఆటతీరును కనబరిచారు. ముఖ్యంగా అండర్-17 బాలుర పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం ఏడు క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు జరిగాయి. ఇందులో బాల్‌బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, సాఫ్ట్‌బాల్, తైక్వాండో, ఫెన్సింగ్ క్రీడాంశాల్లో ఎంపికలు జరిగాయి. స్విమ్మింగ్ ఎంపికలు శాంతినగర్ కాలనీలోని డీఎస్ఏ సిమ్మింగ్ పూల్ వేదికగా జరిగాయి. అలాగే టేబుల్ టెన్నిస్ ఎంపికలు శ్రీకాకుళం పీఎన్ కాలనీలోని న్యూసెంట్రల్ స్కూల్ వేదికగా జరిగాయి. తైక్వాండో, ఫెన్సింగ్ ఎంపికలు శ్రీకాకుళం టౌన్‌హాల్ వేదికగా జరిగాయి. షటిల్ బ్యాడ్మింటన్ ఎంపికలు శాంతినగర్ కాలనీలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జరిగాయి. ఈ ఎంపికలు జరుగుతున్న తీరును డీఈఓ కె.వెంకటేశ్వరరావు సంబంధిత అధికారులను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటున్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బీవీ రమణ, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, కె.మాధవరావు తదితరులు పర్యవేక్షించారు.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి



ట్రాక్‌పై మృతదేహం

జలుమూరు: తిలారు రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. జోనంకి పంచాయతీ పరిధి గంగాధరపేటకు చెందిన ముద్దాడ అప్పన్న (38) తిలారు రైల్వేస్టేషన్ సమీపంలో ట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టి ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు జీఆర్‌పీ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతుడికి భార్య పావని, కుమారులు అనంత్, శ్రీధర్‌లు ఉన్నారు.

కడపలవాని గెడ్డపై పెరిగిన వరద నీరు



రోడ్డు పై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

ఎల్ ఎన్ పేట: మండలంలోని తురకపేట-దబ్బపాడు గ్రామాల మధ్య ఉన్న కడపలవాని గెడ్డపై వరద నీటి ప్రవాహం పెరిగింది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు దేశవాళీ వరద నీరు వచ్చి చేరిందని స్థానిక రైతులు చెబుతున్నారు. వరద నీరు చేరటంతో పంట పొలాలు నీట మునుగుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గెడ్డపై సుమారు అయిదు అడుగుల నీరు ప్రవహించటంతో దబ్బపాడు-తురకపేట గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయని అన్నారు.

థర్మల్ కేసుల ఎత్తివేతకు వినతి



స్పీకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సాయిరాజ్, పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార నాయకులు

సోంపేట: థర్మల్ పోరాటం సమయంలో కొందరు స్థానికులపై వేసిన కేసుల ఎత్తివేతకు కృషి చేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాంను ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ కోరారు. పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార నాయకులతో కలిసి మంగళవారం విజయవాడలో ఆయన స్పీకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. థర్మల్ ఉద్యమం సమయంలో 725 మందిపై కేసులు వేశారని, సోంపేట సబ్ కోర్టులో ఇప్పటికీ కేసులు నడుస్తున్నాయని తెలిపారు. ఈ కేసుల్లో బాధితులుగా యువత, కార్మికులు, మత్స్యకారులు, రైతులు ఉన్నారని, వీరిలో చాలా మంది పాస్‌పోర్టులు సీజ్ చేయడంతో ఇబ్బంది కలుగుతోందని వివరించారు. గత ప్రభుత్వం జారీ చేసిన 329 జీఓ రద్దు చేయాలన్నారు. సోంపేట, టెక్కలి సబ్‌కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న థర్మల్ కేసులను రద్దు చేయడానికి అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. అలాగే మరికొన్ని సమస్యలను ప్రస్తావించారు. పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ యారడి కృష్ణమూర్తి, కార్యదర్శి తమ్మినేనిరామారావు, మత్స్యకార నాయకుడు సత్యరాజ్‌ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



పలాస మార్చురీలో కుమ్మరి సురేష్ మృతదేహం

కాశీబుగ్గ: పలాస మండలం లొద్దబద్ర పంచాయతీ సున్నాడ గ్రామంలో కుమ్మరి సురేష్ (27) అనే యువకుడు మంగళవారం విద్యుత్ షాక్ తగిలి కిందపడి మృతి చెందాడు. గ్రామంలో వినాయక అన్నదాన కార్యక్రమానికి ఇంటింటికీ బియ్యం సేకరణ కోసం వాహనంపై వెళ్తుండగా వాహనానికి విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో సురేష్ ఒక్కసారిగా కిందకు పడిపోయాడు. తల వెనుక భాగానికి రోడ్డు గట్టిగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన వారికి ఏమీ కాలేదు. ఇటుకలు తయారు చేసి జీవనం గడుపుతున్న ఆ కుటుంబానికి కుమారుడే ఆధారంగా భావిస్తున్నారు. కుమారుడి మృతి వార్త తెలిసి తల్లిదండ్రులు సింహాద్రి, అన్నపూర్ణ కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వ బియ్యం పంపిణీలో వాహన చోదకుడిగా ఉన్న సురేష్ మరణించడంతో గ్రామమంతా విషాదంలో మునిగిపోయింది.

చికెన్		
బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

వ్యాన్ బోల్తా పడి చేపల వ్యాపారి మృతి



మృతుడు జాన నరసింహులు (ఫైల్)

భోగాపురం: మండలంలోని సుందరపేట జాతీయ రహదారిపై వ్యాన్ బోల్తాపడి శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలానికి చెందిన చేపల వ్యాపారి జాన నరసింహులు(32) మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నరసింహులు చేపల వ్యాపారం చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో విశాఖపట్నంలో చేపలు కొనుగోలు చేసుకుని వ్యాన్‌లో శ్రీకాకుళం వెళ్తుండగా వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నరసింహులు కింద పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు తగరపువలస ఎస్ఆర్ఐ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య నీలవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

నీ బంటు మేమంటు

- తిప్పనపుట్టుగలో ఆదర్శంగా వినాయక చవితి
- ఐదున్నర దశాబ్దాలుగా ఒకే మండపం ఏర్పాటు
- కొబ్బరి, అరటి గెలలతో అలంకరణ



లడ్డూ వేలంలో పాల్గొన్న గ్రామ ప్రజలు



ఉత్సవంలో గ్రామం పొడుగునా ఏర్పాటు చేసిన కొబ్బరి, అరటి గెలలు



గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం

ఇచ్ఛాపురం రూరల్: ఉదయం భక్తి పాటలు, రాత్రి సినిమా పాటల వింత ప్రవర్తన ఉండదు. దేవుడి ముందు డీజేల గోలలు, అశ్లీల నృత్యాల అకృత్యాలు కనిపించవు. పండుగ అలంకరణలో దర్పమన్నది ఉండదు. ఐదున్నర దశాబ్దాలుగా వినాయక చవితి వేడుకను అత్యంత భక్తిశ్రద్ధలతో.. అదీ ఒకటే మండపంలో ఊరంతా జరుపుకుంటున్నారు. ఆ ఊరి పేరు ఇచ్ఛాపురం మండలం తిప్పనపుట్టుగ.

రెండు మండలాలకు ఒకే గ్రామం

ఇచ్ఛాపురం, కవిటి మండలాలకు చెందిన గ్రామం తిప్పనపుట్టుగ. పేరుకే రెండు మండలాల గ్రామస్తులు. గ్రామం ఒక్కటే కావడంతో అందరూ కలిసి కట్టుగా కార్యక్రమాలు చేస్తూ తమలో ఐక్యతను చాటుకుంటుంటారు. సుమారు వెయ్యికి పైగా జనాభా ఉన్న ఈ గ్రామంలో 55 ఏళ్ల కిందట పెద్దలు నిర్ణయించిన విధంగానే స్థానిక బస్టాండ్ మర్రిచెట్టు కింద వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఒకే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. కులమతాలకు అతీతంగా రెండు మండలాలకు చెందిన వారందరూ కలసి ఈ విగ్రహం వద్దే పూజలు నిర్వహిస్తారు. మండపం వద్ద డీజేలు, నృత్యాలు కాకుండా సామూహిక కుంకుమ పూజలు, భజనలు, కబడ్డీ పోటీలు, కోలాటాలు, రేలారేలా జానపద నృత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు వారం రోజుల పాటు నిర్వహిస్తుంటారు.

కొబ్బరి, అరటి గెలలతో..

ఈ గ్రామానికి చెందిన రైతులు వినాయక చవితి ఉత్సవానికి బహుమతిగా ప్రతి ఒక్క కొబ్బరి రైతు ఒక కొబ్బరి గెలను, తమ తోటల్లో పండించే అరటి గెలను ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. వీటిని గ్రామం పొడుగునా ప్రదర్శించడం ఇక్కడ ప్రత్యేకత. విగ్రహం నిమజ్జనం అనంతరం కొబ్బరి కాయలు, అరటి గెలతో పాటు లడ్డూను వేలం వేయడం, వచ్చిన మొత్తంతో అన్నదానం, వచ్చే ఏడాది చవితి ఉత్సవాలకు వినియోగిస్తున్నట్లు గ్రామ పెద్దలు చెబుతున్నారు.

ఆనవాయితీ కొనసాగిస్తున్నాం



అంతా కలసిమెలసి ఉండాలన్న ఉద్దేశంతో 55 ఏళ్ల కిందట గ్రామ పెద్దలు గ్రామంలో ఒకే వినాయక విగ్రహం ఉండాలని నిర్ణయించారు. అప్పటి నుంచి ఈ ఆనవాయితీని కొనసాగిస్తున్నాం. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్నాం.

– రత్నాల తారకేశ్వరరావు,
నిర్వాహక కమిటీ సభ్యుడు, తిప్పనపుట్టుగ